క్లుప్తంగా

అల్లూరులో జిల్లాస్థాయి భజన పోటీలు

కొత్తపట్నం: శ్రీరామనవమి సందర్భంగా మండలంలో అల్లూరు గ్రామంలో సీతాసమేత కోదండరామస్వామి వారి దేవస్థానంలో జిల్లాస్థాయి భజన పోటీలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది పోటీలు జరుగుతాయనని అందులో భాగంగా ఈ ఏడాది కూడా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఏప్రిల్ 5వ తేదీ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటలకు పోటీలు ఉంటాయన్నారు. వివిధ రకాల పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. మొదటి బహుమతి రూ. 25 వేలు కే పల్లెపాలెం గ్రామానికి చెందిన లంకే మురళీ, రెండో బహుమతి రూ. 20 వేలు శింగమనేని చంద్రశేఖర్ దంపతులు, మూడో బహుమతి రూ.15 వేలు కే పల్లె పాలెం గ్రామానికి చెందిన నాయుడు వెంకటేశ్వర్లు, నాలుగో బహుమతి రూ.10 వేలు అల్లూరు గ్రామానికి చెందిన గుత్తికొండ శ్రీనివాసులురెడ్డి సొంత నగదుతో బహూకరిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు భజన పోటీలో పాల్గొనాలని కోరారు. వివరాలకు 98496 00159, 99511 60038 నంబర్లలో సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి

కొత్తపట్నం: ప్రభుత్వ పథకాలు రైతులకు అందాలంటే 11 నెంబర్ గల ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలో అల్లూరు గ్రామంలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు రబీలో సాగుచేసిన పంటలను ఈ–క్రాప్ ద్వారా నమోదు చేసిన జాబితాలను రైతుసేవా కేంద్రంలో ఉంచామన్నారు. ఉద్యాన అధికారి తేజ మాట్లాడుతూ పూలు సాగుచేసుకోవడానికి ఒక ఎకరానికి రూ.64 వేలు, హైబ్రిడ్ కూరగాయలకు ఎస్సీ రైతులకు రూ.80 వేలు, అదేవిధంగా పవర్ స్ప్రేయర్‌కు రూ.10 వేలు, రాయితీల ద్వారా ఇస్తారన్నారు. అల్లూరు పశువైద్యాధికారి శోభ మాట్లాడుతూ నట్టల నివారణకు మందులు, దాణా, చాఫ్ కటర్స్ సబ్సిడీపై అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఫిషరీస్ అసిస్టెంట్, ఏఈవో, వీఏఏలు పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీ



చోరీ జరిగిన విధానాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శివరామయ్య

మద్దిపాడు: పాఠశాలలో దొంగలు పడ్డారు. మండలంలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగిన విషయం వెలుగు చూసింది. ఎస్సై శివరామయ్య వివరాల మేరకు.. పాఠశాలలో మంగళవారం తెల్లవారుజామున ప్రధానోపాధ్యాయుడి గదిలో ఉన్న బీరువాను పగులగొట్టి రూ.10 వేల నగదును దొంగిలించుకుపోయారు. ఈ విషయం మంగళవారం ఉదయం ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుని ఫిర్యాదు మేరకు ఎస్సై ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరు వ్యాపారులపై కేసులు



సిలిండర్లను గ్యాస్ గోడౌన్‌కు అప్పగిస్తున్న విజిలెన్స్ అధికారులు

కొత్తపట్నం: గృహ వినియోగానికి వాడాల్సిన గ్యాస్ సిలిండర్లను వ్యాపారానికి వాడుతున్నట్లు తెలుసుకున్న అధికారులు కేసులు నమోదు చేశారు. కొత్తపట్నం గ్రామంలో మంగళవారం పౌరసరఫరా శాఖ ప్రత్యేక అధికారి ఏ కుమార్, సీఎస్ డీటీ ఫిరోజ్, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ ప్రమోద్‌లు సాయంత్రం దాడులు జరిపారు. కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో చిరు వ్యాపారులను ఆకస్మిక తనిఖీలు చేశారు. ఏడుగురు వద్ద గృహాలకు ఉపయోగిస్తున్న 16 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న సిలిండర్లను స్థానిక శాంతి ఇండియన్ గ్యాస్ గోడౌన్‌లో భద్రపర్చారు. ఈసదర్భంగా కుమార్ మాట్లాడుతూ వ్యాపారానికి వినియోగించాల్సిన సిలిండర్లను వినియోగించకుండా గృహాలకు వాడుకునే సిలిండర్లను వినియోగిస్తున్నారని చెప్పారు. ఇలా మరోసారి పునరావృతం అయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

వెలుగొండ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండలో ఈ నెల 21, 22, 23వ తేదీల్లో నిర్వహించే శ్రీవారి బ్రహ్మోత్సవ తిరునాళ్లకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డితో కలిసి వెలుగొండ క్షేత్రంలో పర్యటించారు. ఎడ్ల పోటీలు, అన్నదాన సత్రాల నిర్వహణ, తిరునాళ్లలో షాపుల ఏర్పాటు, ట్రాఫిక్ తదితర అంశాలు, ఇతర ఏర్పాట్లపై ఈఓ చెన్నకేశవరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులతో చర్చించారు. మూడు రోజులపాటు తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్సై వెల్లడించారు.

అంతర పంటలతో అదుర్స్ ..!

- రైతులకు లాభాలు కురిపిస్తున్న అంతర పంటలు
- చీమకుర్తి మండలంలో 25 ఎకరాల్లో సాగు
- తక్కువ స్థలం, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు



బండ్లమూడిలో పొట్లకాయ పందిరి



అప్పుడే కోసిన తాజా కూరగాయలు పొట్లకాయ, కాకర



బెండకాయలు

చీమకుర్తి రూరల్:

ప్రస్తుతం వ్యవసాయం అనేది ఎంతో ఖర్చు, వ్యయప్రయాసలతో కూడుకున్నది. పెట్టుబడి, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చు ఇలా రైతన్నకు తడసిమోపడవుతోంది. ఈనేపథ్యంలో కొందరు రైతులు తెలివిగా వ్యవసాయం చేస్తున్నారు. అధిక పెట్టుబడి పెట్టి అప్పుల పాలవ్వకుండా తక్కువ స్థలంలో, తక్కువ పెట్టుబడితో అంతర పంటలు సాగుచేస్తూ లాభాల బాట పడుతున్నారు. ఆధునిక వ్యవసాయ రంగంలో పంటల సాగులో అన్నదాతలు అప్‌డేట్ అవుతున్నారు. కొత్త కొత్త విధానాలు అవలంబిస్తూ ఆర్థికంగా ఎదిగేందుకు ప్రయత్నిస్తున్నారు.

మిశ్రమ పంటలతో రైతన్నలకు లాభం..

తక్కువ శ్రమతో ఎక్కువ లాభాలు పొందే విధానాలు పాటిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రధాన పంటల్లో అంతర పంటలు సాగుచేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. చీమకుర్తి మండల పరిధిలోని పలు గ్రామాల్లో బండ్లమూడి, పడమటి నాయుడుపాలెం, పాటిమీదపాలెం, ఇలపావులూరు రైతులు అంతర పంటల సాగు వ్యవసాయ పద్ధతుల విధానంలో మిశ్రమ పంటల సాగు అలవరచుకున్నారు. ఒక ఎకరా పొలంలో ఒకేరకం పంటవేస్తే అధిక దిగుబడి రాకపోగా నష్టాలు చవిచూస్తున్న అన్నదాతలు, అందుకుగాను రైతులు తమ వ్యవసాయ పద్ధతుల విధానంలో మార్పులు చోటుచేసుకుని తక్కువ స్థలంలో రెండు, మూడు మిశ్రమ పంటలు సాగుచేస్తున్నారు. పొట్లకాయ, బెండ పందిరిలో టమోటా, దోస, కాకర, గోంగూర సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తూ లాభార్జనతో ముందుకు వెళ్తున్నారు. చీమకుర్తి మండలంలో 25 ఎకరాల్లో రైతన్నలు అంతరపంటల్లో కూరగాయలు సాగు చేస్తూ పలువురి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

రైతుల దగ్గర కూరగాయల ధరల పట్టిక..

పంట	విస్తీర్ణం	పంట కోత రోజులకు	దిగుబడి కేజీలు	రేటు (1 కేజి)
బెండకాయ	1 ఎకర	2	400	రూ.25
పొట్లకాయ	1 ఎకర	3	200	రూ.25
కాకర	1 ఎకర	4	300	రూ.25
దొండకాయ	1 ఎకర	7	1000	రూ.20

అంతర పంటల విధానంతో ప్రయోజనాలు ..

- అంతర పంటలు సాగుచేయడం ద్వారా ప్రధాన పైరు మొక్కల మధ్య ఉన్న స్థలం వృథా కాకుండా ఉపయోగపడుతుంది. పంట సూర్యరశ్మి, నీరు పోషకాలు కూడా బాగా ఉపయోగించుకుంటాయి.
- ప్రకృతి వైపరీత్యాల వలన ఒక పైరు దెబ్బతిన్నా.. మరో పైరు ఎంతో కొంత దిగుబడినిచ్చి రైతును కష్టకాలంలో ఆదుకుంటుంది లేదా రెండు పైర్ల నుంచి కూడా అధిక దిగుబడులను పొందవచ్చు.
- అంతర పంటలు సాగు విధానం ద్వారా నేలకోత తగ్గుతుంది.
- అంతర పంటలు సాగు ద్వారా కీటకాలు ,తెగుళ్లు, కలుపు మొక్కల బెడద కొంతవరకు తగ్గే అవకాశాలు ఉన్నాయి.
- అంతర పంటలు అపరాల జాతికి చెందినవైతే, ప్రధాన పంటలకు కొంత మేర నత్రజని అందే అవకాశం.
- చిరుధాన్యాలు, నూనె గింజలు, పప్పుధాన్యాలు మొదలైన పంటల ఉత్పత్తి పెంచుకోవచ్చును.

మిశ్రమ పంటల సాగు ఆశాజనకం..



మిశ్రమ పంటలు సాగు విధానంలో ఒక రకం పంట దిగుబడి తగ్గినా ఇంకో పంటలో దిగుబడి వస్తుంది. ఒక రకం పంట ధర తగ్గినా, ఇంకో పంటలో ధర వస్తుంది. ఈ విధమైన వ్యవసాయ పద్ధతుల విధానంలో మిశ్రమ పంటల సాగు ఆశాజనకంగా ఉంది.

– యన్నం శేషురెడ్డి, బండ్లమూడి

ఒకే సమయంలో రెండు, మూడు పంటలు..



ఒకే సమయంలో తక్కువ స్థలంలో రెండు మూడు రకాల మిశ్రమ పంటలు సాగు చేయడం వలన పెట్టుబడి తగ్గుతుంది. సమయం కలిసి వస్తుంది. తక్కువ కాలపరిమితిలో వ్యవసాయ విధానం అన్ని విధాల బాగుంటుంది.

– కూరాకుల శ్రీనివాసరెడ్డి, పీ నాయుడుపాలెం

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు



అభిషేకాన్ని తిలకిస్తున్న భక్తులు

ఒంగోలు మెట్రో: సంకటహర చతుర్థి రోజున వినాయకుడిని పూజిస్తే సకల విఘ్నాలు తొలగి పనులు నెరవేరుతాయని అర్చకులు తెలిపారు. క్రోధి నామ సంవత్సరం, ఫాల్గుణ మాసం మంగళవారం సంకటహర చతుర్థి సందర్భంగా నగరంలోని గణపతి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్థానిక పేర్నమిట్ట సిద్ధి, బుద్ధి దేవస్థానంలో, కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న గణపతి ఆలయం, అద్దంకి బస్టాండ్ దగ్గర ఉన్న విజయ గణపతి దేవాలయం, బాపూజీ కాంప్లెక్స్ ఆవరణలో కొలువై ఉన్న వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం, నెల్లూరు బస్టాండ్ దగ్గర సిద్ధి గణపతి దేవాలయం, రాజా పానగల్ రోడ్డులోని లక్ష్మీ గణపతి దేవస్థానం, శ్రీనగర్ కాలనీలోని సిద్ధిబుద్ధి సమేత గణపతి దేవాలయంలో, సమతానగర్, మణికంఠ నగర్‌లోని కార్యసిద్ధి గణపతి దేవాలయం, త్రోవగుంట, కొప్పోలు, పెళ్లూరు గణపతి దేవాలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఏడు గంటలకు స్వామి మూలవిరాట్ కు సుగంధ పరిమళ ద్రవ్యాలు పసుపు, కుంకుమ, గంధం విభూది, చందనం, వివిధ రకాల పండ్ల రసాలతో పంచామృత అభిషేకం నిర్వహించారు. గణనాథునికి ప్రీతికరమైన గరికతో అష్టోత్తర శతనామాలు పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలతో పంచ హారతులతో భక్తులకు స్వామి దివ్యదర్శన భాగ్యం కల్పించారు. ఉదయం పది గంటలకు కార్యసిద్ధి గణపతి దేవస్థానంలో అర్చకుడు రాము దంపతుల చేత లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో కార్యసిద్ధి గణపతి

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్



చీమకుర్తిలో సమీక్షలో నిర్వహిస్తున్న ఎంపీడీవో రాఘవేంద్ర



ఉల్లాస్ కార్యక్రమంపై సమీక్షిస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు: నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ ముఖ్య కార్యక్రమమని ఎంపీడీవో డీ సురేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఉల్లాస్ కార్యక్రమంపై వెలుగు, అంగన్‌వాడీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏ ఒక్కరూ నిరక్షరాస్యులుగా ఉండకూడదన్నారు. రాత్రి వేళల్లో మహిళలకు వలంటరీ ద్వారా గత రెండు నెలలు నుంచి విద్య నేర్పిస్తున్నారని చెప్పారు. నేర్చుకున్న విద్య పై మహిళలకు ఈ నెల 23వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు పరీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. వెలుగు సీసీలు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు వీటికి పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. ఈ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. ఈసమావేశంలో అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్వైజర్ కే. జ్యోతి, ఎంఈవో. డి వెంకారెడ్డి, వెలుగు ఏటీఎం . టి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

23న ఉల్లాస్ పరీక్షలు..

చీమకుర్తి రూరల్: మండలంలో 900 మంది నిరక్షరాస్యులకు ఈనెల 23న మదింపు పరీక్ష నిర్వహిస్తున్నట్లు వయోజన విద్య ఉల్లాస్ కన్వీనర్ టీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కే రాఘవేంద్ర అధ్యక్షతన ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తయారుచేయడం ఉల్లాస్ కార్యక్రమం లక్ష్యం అన్నారు. అభ్యసించిన వారికి పరీక్ష నిర్వహణకు 20 అంగన్‌వాడీ కేంద్రాలలో తగు ఏర్పాట్లు చేయాలని ఐసీడీఎస్ సిబ్బందికి సూచనలిచ్చారు. మదింపు పరీక్షలో ఉత్తీర్ణులకు ఎన్ఐఓఎస్ ధ్రువీకరణ పత్రం ఇస్తారని తెలిపారు.

ఫార్మాలో కెమిస్ట్రీకి ఉన్నత అవకాశాలు



వరాల రవిని సన్మానించిన రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు సిటీ: రసాయన శాస్త్రంలో విద్యార్థులు ప్రావీణ్యం సంపాదిస్తే భవిష్యత్‌లో ఉన్నత అవకాశాలు లభిస్తాయని ఆంధ్ర కేసరి యూనివర్శిటీ రిజిస్ట్రార్, కెమిస్ట్రీ డిపార్టుమెంట్ హెడ్ ప్రొఫెసర్ బీ హరిబాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆంధ్ర కేసరి యూనివర్శిటీ సమావేశ హాలులో కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'కెరీర్ ఆపర్చునిటీస్ ఫర్ ఆర్గానిక్ కెమిస్ట్రీ ఇన్ ఫార్మా' అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథి ఉపన్యాసకుడిగా స్క్రిప్స్ ఫార్మా వైస్ చైర్మన్ డాక్టర్ వరాల రవి పాల్గొని మాట్లాడుతూ ఫార్మా రంగం నేడు ఎంతగానో విస్తరిస్తోందన్నారు. ఈ రంగానికి కెమిస్ట్రీ విభాగం అనుబంధ రంగంగా ఉంటోందని, అందువల్ల రసాయనశాస్త్ర విభాగంలో మంచి ప్రావీణ్యం కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. అంతేకాకుండా ఫార్మా రంగంలో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ముఖ్యంగా మందుల తయారీ విభాగంలో అత్యుత్తమ అవకాశాలు లాభిస్తున్నాయని, అందివస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్ రావు, కెమిస్ట్రీ సహాయ ఆచార్యులు డాక్టర్ ఉబ్బా ఈతముక్కల, జాస్మిన్, కెమిస్ట్రీ విభాగానికి చెందిన పలువురు స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం అతిథి వరాల రవిని రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

కేజీ పొగాకు ధర రూ.280

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్టలో గల ఒంగోలు1 పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో కేజీ పొగాకు ధర రూ.280 పలికింది. చిలంకూరు క్లస్టర్ పరిధిలో 226 బేళ్లను వేలానికి ఉంచగా, 170 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 56 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ కనిష్ఠ ధర రూ.260, సరాసరి ధర రూ.271.93 పలికింది. వేలంలో మొత్తం 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా, వేలం నిర్వహణ అధికారి ఎం.రవికాంత్ పర్యవేక్షించారు.

21న అభయాంజనేయ స్వామి తిరునాళ్లు



అభయాంజనేయ స్వామి

పొదిలి రూరల్: పొదిలి మండలం ఏలూరు పంచాయతీలోని ఒంగోలు–కర్నూలు రహదారి ముసి బ్రిడ్జి వద్ద కొలువై ఉన్న అభయాంజనేయస్వామి, వరసిద్ధి వినాయక స్వామి తిరునాళ్ల ఈ నెల 21వ తేదీ నిర్వహించనున్నట్లు దేవస్థానం కమిటీ కార్యనిర్వాహకులు ధర్మవరపు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఆకు పూజ, మధ్యాహ్నం, సాయంత్రం ఆలయం వద్ద ఉన్న కాశీ నాయన సత్రంలో అన్న సంతర్పణ చేయనున్నట్లు వివరించారు. రాత్రికి ఏలూరు గ్రామంలో విద్యుత్ ప్రభలు, కోలాటం, బ్రహ్మంగారి నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా మంగళవారం ఆలయ పరిసరాలు, ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసే ప్రదేశాలను ఎస్సై వేమన పరిశీలించారు. శాంతియుత వాతావరణంలో తిరునాళ్ల నిర్వహించేందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

ఈ-కామర్స్ మోసాల నివారణకు కొత్త నిబంధనలు



బహుమతులు అందిస్తున్న జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు

ఒంగోలుమెట్రో: ఈ–కామర్స్ అమ్మకాల ద్వారా జరిగే మోసాలను అరికట్టడానికి వినియోగదారుల హక్కుల చట్టం– 2019 ప్రకారం కొత్త నిబంధనలు ప్రవేశపెట్టిందని జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు డాక్టర్ సమీరా పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఇందిరా ప్రియదర్శిని కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు కలాం, ప్రకాశం నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల గురించి విస్తృత అవగాహన, ప్రచారం చేయడం న్యాయ కళాశాల విద్యార్థులు బాధ్యత వహించాలని తెలిపారు. వినియోగదారుల మంత్రిత్వశాఖ ప్రవేశపెట్టిన మేలుకో వినియోగదారుడా మేలుకో, ఈ–జాగృతి ఆప్ గురించి వివరించారు. కళాశాల డైరెక్టర్ బత్తిన మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి క్లబ్ ఫౌండర్ డాక్టర్ షాకీర్ సభాధ్యక్షత వహించారు. క్లబ్ ప్రెసిడెంట్ చిట్టిబాబు, క్లబ్ ట్రెజరర్ దాసరి కరుణాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కే నటరాజ్ కుమార్, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ కళాశాల గెస్ట్ ఫ్యాకల్టీ సుంకర సాయిబాబా, రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ మహంకాళి వెంకట శేషయ్యలు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజం



విద్యుల్లతను శాలువతో సన్మానించిన కళాశాల అధ్యాపక బృందం

ఒంగోలు సిటీ: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. కళ్యాణి పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో జంతుశాస్త్రం అధ్యాపకురాలిగా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న వీఎస్ విద్యుల్లత ఉద్యోగ విరమణ సందర్భంగా కళాశాల బృందం ఆమెను ఘనంగా సత్కరించింది. కార్యక్రమం పీ యామిని అమ్మాజీ స్వాగతంతో ప్రారంభమైంది. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2020 నుంచి డిప్యుటేషన్‌పై కళాశాలలో విద్యుల్లత ఇక్కడ పనిచేస్తోందన్నారు. 36 సంవత్సరాల అనుభవంలో ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిందని ఆమె కృషిని, సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డోలా అనంతలక్ష్మి, చెన్నమనేని వెంకటేశ్వర్లు, వీ శ్రీలక్ష్మి, డాక్టర్ ఏవీ రాజ్యలక్ష్మి, డాక్టర్ పీ ఇందిరా, మన్నె శ్రీనివాసులు, డాక్టర్ ఎం. మంజుల భారతి, జె.యాన్. సురేష్ కుమార్, అధ్యాపక బృందం పాల్గొని, అభినందనలు తెలిపారు.

కాటంరాజు తిరునాళ్లకు ఏర్పాట్లు

మార్కాపురం: ఈనెల 29న కాటంరాజు, గంగాభవాని తిరునాళ్లకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ ప్రతినిధి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి పిన్నిక లక్ష్మీప్రసాదయాదవ్, కమిటీ అధ్యక్షుడు వెంకటరావు యాదవ్ తెలిపారు. మంగళవారం బీసీ భవన్‌లో జరిగిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరునాళ్లకు వచ్చే భక్తుల కోసం భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు అన్నదానం చేయడంతో పాటు మినరల్ వాటర్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసేవారు కమిటీని సంప్రదించాలని సూచించారు. కాటంరాజు స్వామివారి చరిత్రను రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు తంగిరాల సుబ్బారావు రచించగా పుస్తక రూపంలోకి తెస్తున్నామన్నారు. ఆలయం వద్ద భోజనశాలను దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పి.పోలురాజు, ఒ.నాగేశ్వరరావు, జి.గంగరాజు, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు, ఎ.శ్రీనివాస్ యాదవ్, నాగం వెంకటేష్, గాలెయ్య, గోపాల్‌రాజు, ముట్వా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

పెద్దారవీడు: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో మండలంలోని కలనూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు దుప్పట్లు ప్రెసిడెంట్ చీదెళ్ల లక్ష్మణరావు మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటరావు మాట్లాడుతూ ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు లక్ష్మణరావు స్నేహితుల సాయంతో గతంలో కూడా పాఠశాల తరగతి గదుల్లో రూ.20 వేల విలువైన ఫ్యాన్లు, విద్యుద్దీకరణ, లక్ష్మణరావు తన సొంత నిధులతో పేద పిల్లలకు బట్టలు పంపిణీ చేశారని గుర్తు చేశారు. వారం రోజుల క్రితం 10వ తరగతి చదువుచున్న విద్యార్థులకు స్నేహితుల సాయంతో పరీక్షలకు ఉపయోగపడే అట్టలు, పెన్నులు అందజేశారని తెలిపారు. అవోపా ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పాఠశాలకు ఏదో విధంగా సహకారం చేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించి పలువురికి సేవ చేసే గుణం అలవర్చుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు బట్టు రామకృష్ణ, సీహెచ్ మహేష్, బి.మల్లికార్జునరావు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డెక్కిన విద్యుత్ మీటర్ రీడర్లు

మార్కాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ మీటర్ రీడర్లు మంగళవారం స్థానిక తర్లుపాడు రోడ్డులోని విద్యుత్ ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు అందె నాసరయ్య, ఎస్‌కే ఖాశిం మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా మీటర్ రీడర్లు విధి నిర్వహణలో అనేక ఇబ్బందులు పడుతున్నారని, శ్రమకు తగిన వేతనం అందక, ఉద్యోగ భద్రత లేక దినదినగండంగా జీవిస్తున్నారన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు వేతనం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నారాయణ, సతీష్, సుబ్రహ్మణ్యం, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.



ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మీటర్ రీడర్లు